ప్రజాశక్తి

శనివారం 21 డిసెంబర్ 2024

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా







నకిలీ పోలీసుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు

నకిలీ పోలీసుల అరెస్టు

●రూ.25.57 లక్షలు స్వాధీనం

●మహిళ సహా నలుగురు అరెస్టు ●పరారీలో మరో నిందితుడు

ప్రజాశక్తి - విజయవాడ : పోలీసులమని బెదిరించి, డబ్బులు లాక్కున్న నిందితులను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.25.57 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం నగరంలో జరిగింది. నగర పోలీసు కమిషనర్ ఎస్‌వి.రాజశేఖర్‌బాబు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 15న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని ఓ బంగారపు షాప్‌లో గుమస్తాగా పనిచేస్తున్న వ్యక్తి తన యజమాని చెప్పిన విధంగా డబ్బులు తీసుకుని చెన్నై, నెల్లూరు వెళ్లి బంగారం కొనుగోలు చేసి వాటిని నుండి బంగారు వస్తువులు తయారు చేసుకుని అమ్ముతుంటాడు. ఈక్రమంలో ఎప్పటిలాగే ఈనెల 11న యజమాని ఇచ్చిన డబ్బులను తీసుకుని చెన్నై వెళ్ళడానికి ట్రైన్ బుక్ చేసుకున్నాడు. ట్రైన్ మిస్ కావడంతో కారు బుక్ చేసుకుని విజయవాడ దగ్గరలోకి వచ్చేసరికి ఖాకీ ఫ్యాంట్, వైట్ టీ షర్ట్, బ్రౌన్ షు వేసుకున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారు ఆపి పోలీసులమని బెదిరించారు. ప్రభాస్ కళాశాల సమీపంలో బలవంతంగా ఆ వ్యక్తి వద్ద ఉన్న బ్యాగ్ తీసుకుని అధికారులకు చూ వస్తామని చెప్పి వెళ్లారు. ఎంతకీ రాకపోవడంతో భయపడిపోయి కింద పడిపోయాడు. క్యాబ్ డ్రైవర్ జగ్గయ్యపేట తీసుకువెళ్ళి అక్కడ ఆస్పత్రిలో చేర్పించాడు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వచ్చి సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు నిమిత్తం సిసిఎస్ పోలీసులకు అప్పగించారు. విజయవాడ క్రైమ్ ఎడిసిపి ఎం.రాజారావు , ఎసిపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన సిసిఎస్ సిఐ పి.శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి ప్రత్యేక బందాలుగా ఏర్పడి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సాంకేతక ఆధారాలను సేకరించారు. అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సిసిఎస్ బృందానికి వచ్చిన

రైతు ఆదాయం పెంపే లక్ష్యంగా

వ్యవసాయ యాంత్రీకరణ

●ముఖ్యమంత్రి చంద్రబాబు

●రైతు సేవా కేంద్రం పరిశీలన

●రైలు మిల్లులో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆరా

●రెవెన్యూ సదస్సులో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, కంకిపాడు : వ్యవసాయం లాభసాటిగా చేయాలని, రైతు ఆదాయం పెంపే లక్ష్యంగా వ్యవసాయ యాంత్రీకరణ జరగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం గంగూరు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడారు. ధాన్యం సేకరణలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో విఏఓ లాగిన్ ఓపెన్ చేసి స్థానిక రైతు ఆకునూరి సాంబశివరావుతో ధాన్యం విక్రయం కోసం వివరాలు నమోదు చేయించారు. ఈ రైతు ఈ ఏడాది 9.96 ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు, దిగుబడి అంచనా 299 క్వింటాళ్లు కాగా, ఇప్పటివరకు విక్రయించిన ధాన్యం పోను ఇంకా 49 క్వింటాళ్లు ఉన్నట్లు ఆన్లైన్లో నమోదు చేసిన రైతు వివరాల ద్వారా తెలుసుకున్నారు. గంగూరులోని వెంకటాద్రి ఆయిల్స్ రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సిఎం పరిశీలించారు. తాము ధాన్యం ఎలా అమ్ముతున్నదీ సీఎంకు రైతులు వివరించారు. గతేడాది కంటే ఈ ఏడాది పంట ఎక్కువగా వచ్చిందని, మిషన్ కోత వల్ల ఎకరానికి అయిదారు వేలు కలిసి వచ్చిందని రైతులు చెప్పారు. కోసిన గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వారు తీసుకుంటే మరో రూ.5 వేల వరకూ వస్తుందని రైతులకు సీఎం వివరించారు. అనంతరం ధాన్యం తేమశాతాన్ని ఎలా గణిస్తారో సీఎం పరిశీలించారు.

ఆదాయం ఎక్కువ వచ్చే పంటలను సాగు చేయండి : సిఎం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏ పంట పండిస్తే ఎక్కువ ఆదాయం వస్తుందో రైతులు ఆలోచించుకోవాలని సిఎం చంద్రబాబు సూచించారు. భూమి, వాతావరణ పరిస్థితులు అంచనా వేసుకుని పంట సాగు చేయాలన్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు డ్రయర్ మిషన్లు పొలం వద్దకే పంపే ఏర్పాటు చేస్తామన్నారు. కాల్వలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.



గంగూరులోని వెంకటాద్రి ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అనంతరం రైతులకు టార్పాలిన్, పరదాలను సిఎం పంపిణీ చేశారు.

ఇప్పటికే 21.42 లక్షల టన్నుల ధాన్యం సేకరణ : సిఎం చంద్రబాబు

రాష్ట్రంలో గత ఏడాది 12.55 లక్షల టన్నులు ధాన్యం సేకరించగా, ఈఏడాది ఇప్పటికే 21.42 లక్షల టన్నులు ధాన్యం సేకరించి 3.20 లక్షల మంది రైతులను భాగస్వామ్యం చేశామని సిఎం చంద్రబాబు చెప్పారు. గంగూరులో హెలిపాడ్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు 4,733 కోట్ల రూపాయలను 3 లక్షల 13 వేల 670 మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. దీనిలో 93 శాతం మందికి 24 గంటల్లోనే జమయినట్లు తెలిపారు. ధాన్యం తేమ శాతం పరీక్షలో రైతు సేవా కేంద్రాలకు, మిల్లులకు మధ్య తేడాలు వస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నందున స్థిరీకరణ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. గత ఏడాది 3.83 కోట్ల సంచులు వినియోగించగా, ఈ ఏడాది 5 కోట్ల సంచులు సరఫరా చేస్తున్నామని తెలిపారు. డ్రయర్ల సమస్య పరిష్కారానికి మొబైల్ డ్రయర్ల వినియోగానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఫేషియల్ అగ్రికల్చర్ అమలులో మొబైల్ యాప్ ద్వారా రైతు తన పొలంలో తెగులు ఉన్న చోటే డ్రోన్ వినియోగంతో నివారణ మందులు పిచికారీ చేసే విధానాన్ని అమలులోకి తేవాలన్నారు.

రెవెన్యూ సమస్యలపై 1,57,481 అర్జీలు వచ్చాయి : సిఎం

కంకిపాడు మండలం ఈడుపుగల్లులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా (మిగతా 2లో)

నేటి నుండి భవానీ దీక్షల విరమణ

●ఏర్పాట్లు పూర్తి

●3 వేలమంది పోలీసులతో బందోబస్తు

●దుర్గా, కృష్ణవేణి ఘాట్లలో టవర్ స్నానాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్, విజయవాడ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యాన భవానీ దీక్షా విరమణలు శనివారం నుండి ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం, విఎంసి అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే భవానీలు గిరిప్రదక్షిణ, దీక్షా విరమణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు తెలిపారు. ఈనెల 21 నుండి 25వ తేదీ వరకూ జరిగే భవానీ దీక్షాల విరమణ కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు శనివారం భవానీ దీక్షా విరమణ మహోత్సవాలు ప్రారంభవుతయి. తొలుత హోమగుండాల్లో పూజలు నిర్వహించి



భవానీ దీక్షా విరమణల స్వాగత ద్వారం

ఉదయం 6.30 గంటలకు అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చే భవానీలు, వారితో వచ్చే కుటుంబీకులు, భక్తులు వినాయక గుడి నుండి ప్రారంభమయ్యే క్యూలైన్ల ద్వారా ఘాట్ రోడ్ మీదుగా దేవస్థానం చేరుకొని, దుర్గమ్మను దర్శించుకోవాల్సి ఉంటుంది. శివాలయం మెట్ల మార్గం ద్వారా క్రిందకి చేరుకుని, హోమగుండం ఎదురుగా ఏర్పాటు చేసిన ఇరుముడి పాయింట్లు వద్ద భవానీలు ఇరుముడులు సమర్పించాల్సి ఉంటుంది. ముడుపులు, కానుకలు సమర్పించుకునే వారు సమర్పిస్తారు.

ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

భవానీ దీక్షా విరమణ ఏర్పాట్లను శుక్రవారం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ఇఓ కెఎస్ రామారావు, ఇతర అధికారులు పరిశీలించారు. దర్శనానికి వచ్చే భవానీలకు అన్నప్రసాదానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లడ్డూల కౌంటర్లనూ పరిశీలించి పలు సూచనలు చేశారు. మహామండపం వద్ద సుమారు 10 ప్రసాదాల కౌంటర్లను సిద్ధం చేశారు.

మూడువేల మంది పోలీసులతో బందోబస్తు

భవానీ దీక్షా విమరణల నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన సుమారు మూడువేల మంది పోలీసు సిబ్బంది నగరానికి చేరుకున్నారు. వారికి వివిధ పాఠశాలలు, కళ్యాణ మండపాలు, లాడ్జీలు వంటి వాటిలో వసతి ఏర్పాట్లు చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్ లక్ష్మీశ

గత అనుభవాలను విశ్లేషించి, లోపాలను సరిదిద్దుతూ ఈసారి భవానీ దీక్షా విరమణలకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు (మిగతా 2లో)



భవానీలకు, యాత్రికులకు సిద్ధం చేసిన క్యూ లైన్లు

పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

హార్టీకల్చర్ డిడి రామమోహన్

ప్రజాశక్తి-విజయవాడ : పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రామమోహన్ ఉద్యోగులను ఆదేశించారు. విఎంసిలో పార్క్స్ సెక్షన్‌లో పని చేస్తున్న ఉద్యోగులతో హార్టికల్చర్ డి. డి ప్రత్యేక సమావేశం నిర్వహించి, పార్కుల అభివృద్ధిపై చేయాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుల్లో అహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. దెబ్బతిన్న పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. రకరకాల మొక్కలు నాటటం, గ్రీనరీ అభివృద్ధి చేయడం, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. త నగరంలో ఉన్న పార్కులలో చేయవలసిన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : నగర ప్రజలకు అహ్లాదకర వాతావరణాన్ని కల్పించడానికి పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శుక్రవారం పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి కమిషనర్ బందావన కాలనీ, ఆయుష్ హాస్పిటల్ పరిసర ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలలో ప్రజలకు ఉపయోగపడేలా అభివద్ధి చేయాలని కోరారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా స్థలాలను గుర్తించి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొకవల్, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)

రామవరప్పాడు శాఖ,
రామవరప్పాడు సర్కిల్, విజయవాడ - 520002 ఫోన్ : 0866-2452069
E-MAIL-ubin0811921@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రామవరప్పాడు శాఖ, అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు తేది. 16-10-2024 న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి రూ. 17,83,562/- పై (రూపాయలు. పదిహేడు లక్షల యనభై మూడు వేల ఐదు వందల అరవై రెండు మాత్రమే) చెల్లించవలసినదిగా ఋణగ్రహీత 1) శ్రీ మద్దూరి సాయి వెంకట నాగ అవినాష్, తండ్రి. రమణ మూర్తి మరియు శ్రీ మద్దూరి వెంకట రమణ మూర్తి, తండ్రి. నాగవధనాలు, ఫ్లాట్ నెం. 405, పిన్నమనేని హైట్స్, శ్రీ పింగళి వెంకయ్య వీధి, రామవరప్పాడు, విజయవాడ, యన్.టి.ఆర్ జిల్లా-521108, 2) శ్రీ మద్దూరి సాయి వెంకట నాగ అవినాష్, తండ్రి. రమణ మూర్తి మరియు శ్రీ మద్దూరి వెంకట రమణ మూర్తి, తండ్రి. నాగవధనాలు, హెచ్. నెం. 16-11-409/2, మూసారంబాగ్, మలక్‌పేట, హైదరాబాద్, తెలంగాణ - 5200036.

సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు తేది. 16-12-2024 న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి బకాయి మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఋణగ్రహీతలు సెక్యూర్డ్ ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, రామవరప్పాడు, శ్రీ పింగళి వెంకయ్య వీధి, పిన్నమనేని హైట్స్, 3వ ఫ్లోర్, ఫ్లాట్ నెం.405, డోర్ నెం.2-79, సర్వే నెం.127/3 కలిగి మొత్తం 1512.2 చ॥గ॥ల పరిధిలో 40 చ॥గ॥ల అవిభాజ్య వాటాలో రెసిడెన్సియల్ ఫ్లాట్ హౌస్.(సేల్ డీడ్ నెం.2823/2011 ది.18-06-2011, ఫ్లాట్ నెం.405 అసెస్‌మెంట్ నెం.2337) దీనికి హద్దులు ఐటమ్-1:: తూర్పు: రోడ్డు, దక్షిణం: కల్లేపల్లి బాపిరాజుకి అమ్మిన ఆస్తి, పడమర: రోడ్డు, ఉత్తరం: వీరమాచినేని రంగారావుకి అమ్మిన ఆస్తి.
పైన తెలిపిన నాలుగు హద్దులలో మొత్తం 1512.2 చ॥గ॥ల పరిధిలో 40 చ॥గ॥ల అవిభాజ్య వాటాలో ఆర్‌సిసి ప్లింత్ 1321 చ॥అ॥ (కామన్ మరియు బాల్కని ఏరియా కలిపి), 90 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా, అన్ని సౌకర్యాలు మరియు సౌలభ్య హక్కులు కలిగి నిర్మించబడినది. దీనికి హద్దులు ఐటమ్-2: : తూర్పు: కారిడార్, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్, ఉత్తరం: ఓపెన్ టు స్కై.

తేది : 16-12-2024
ప్రదేశం : రామవరప్పాడు
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



రెవెన్యూ సదస్సుకు హాజరైన జనం

రైతు ఆదాయం పెంపే లక్ష్యంగా వ్యవసాయ యాంత్రీకరణ

చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. 40 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. 27 మంది రెవెన్యూ సమస్యలపై, ఇతర శాఖలకు సంబంధించి 13 అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఇప్పటివరకు లక్షా 57 వేల 481 అర్జీలు ప్రభుత్వం వద్దకు వచ్చాయన్నారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ కోసం 78,854 దరఖాస్తులు, ఇంటి జాగా కోసం 9,830 వినతులు, ల్యాండ్ గ్రాబింగ్‌కు సంబంధించి 9,528 ఫిర్యాదులు, ప్రభుత్వ భూమి కోసం 8,366 దరఖాస్తులు, ఆక్రమణలకు సంబంధించి 8,227 ఫిర్యాదులు వచ్చాయన్నారు. అధికార యంత్రాంగంపైనే 8 వేల ఫిర్యాదులు వచ్చాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 16,816 గ్రామాలకుగాను 6,698 గ్రామాల్లో రీసర్వే చేశారని, అయితే ఈ రీసర్వేకు సంబంధించి తప్పుడు సర్వే జరిగిందంటూ దాదాపు 2,79,148 మంచి ఫిర్యాదులు చేశారని తెలిపారు. తాము తప్పులు లేకుండా భూముల రీ సర్వే పూర్తి చేసి క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర వేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలను అందిస్తామని చెప్పారు. జియో ట్యాగింగ్‌తో భూమి వివరాలను పరిశీలించే అవకాశం కల్పిస్తామన్నారు. ఈడుపుగల్లు బిసి కాలనీలో 22 ఏ జాబితాలో చేరిన 176 మంది ఇంటి స్థలాలకు బేషరతుగా పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెళ్ల మనోహర్, కష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, పెనమలూరు, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, పెడన, శాసనసభ్యులు బోడె ప్రసాద్, మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, వెనిగళ్ళ రాము, కాగిత కష్ణ ప్రసాద్, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యదర్శి వీర పాండ్యన్, కమిషనర్ జిలాని, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారిణి వి పార్వతి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ డి షర్మిల, జిల్లా మేనేజర్ పద్మ దేవి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వీరయ్య పిన్నమనేని, రైస్ మిల్ యజమాని వి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పోలీసుల అరెస్టు

సమాచారం మేరకు శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డు భానునగర్‌లోని ఓ ఇంటి సమీపంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విజయవాడ సీతారాంపురంనకు చెందిన చేగు పార్దసాయి, బిఆర్‌టిఎస్ రోడ్డు భానునగర్‌కు చెందిన ప్రత్తిపాటి శాంతి, నగరంలోని ఓల్డ్ ఆర్‌ఆర్‌పేటకు చెందిన షేక్ హజారుద్దిన్ (రౌడీ షీటర్), వించిపేటకు చెందిన పటాన్ సుభాని ఖాన్‌ను విచారించారు. ఇబ్రహీంపట్నం దుర్గాకాలనికి చెందిన గుళ్ళూరు వంశి కష్ణం రాజు పరారీలో ఉన్నాడు. నిందితులలో చేగు పార్దసాయి గతంలో జగ్గయ్యపేట లో నివసించాడు. గతంలో పలు వ్యాపారాలు చేస్తున్న సమయంలో జల్సాలకు అలవాటుపడి నష్టపోయాడు. ఈ నేపథ్యంలో గతంలో జగ్గయ్యపేటలో తనకు తెలిసిన వ్యక్తి బంగారం కొనుగోలు నిమిత్తం డబ్బులు తీసుకుని చెన్నై వెళుతున్నాడని తెలుసుకున్నాడు. తనకు తెలిసిన ప్రత్తిపాటి శాంతి ఇంటికి వెళాడు. ఆమెకు తెలిసిన పటాన్ సుభాని ఖాన్, గుల్లూరు వంశీ కష్ణం రాజు, రౌడీ షీటర్ అయిన షేక్ హజారుద్దిన్ అలియాస్ చోటులను ఇంటికి పిలిచి దోపిడీకి పథకం రచించి నకిలీ పోలీసుల అవతారమెత్తి దోపిడీకి పాల్పడ్డారు. 25 లక్షల 57 వేల రూపాయల నగదు బ్యాగ్, మొబైల్ తీసుకుని పరారయ్యారు. శుక్రవారం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి దోపిడీకి పాల్పడిన సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ కేసును అతి తక్కువ సమయంలో ఛేధించిన సిసిఎస్ పోలీసులను పోలీసు కమిషనర్ అభినందించారు.

నేటి నుండి భవానీ దీక్షల విరమణ

లేకుండా అదేవిధంగా ప్రభుత్వ ఏర్పాట్లలో అంతరాయం లేని డిజిటల్ సేవలు అందించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో టెలికం నెట్‌వర్క్-ఇంటర్నెట్ సేవల ప్రొవైడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే భవానీ దీక్షా విరమణల కార్యక్రమానికి పటిష్ట కమ్యూనికేషన్ ప్రణాళికను అమలుచేస్తున్నామని.. డిజిటల్ సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా చేస్తున్న ఏర్పాట్లలో టెలికం సంస్థలు కీలక భాగస్వాములు కావాలని సూచించారు. ఈసమావేశంలో డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, ఏపీఎస్ఎఫ్ఎల్, బీఎస్ఎన్ఎల్, రిలయన్స్ జియో తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)

బెంజ్ సర్కిల్ శాఖ
సితారా టవర్స్, NCBN కాలని, బెంజ్ సర్కిల్, విజయవాడ-10 ఫోన్ నెం. 9326716091
Email- ubin0816094@unionbankofindia.bank

ఇ. వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం ఆస్థుల అమ్మకపు ప్రకటన, స్థిరాస్తుల అమ్మకమునకు సంబంధించి సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 2002 యొక్క రూల్ 8(6) ప్రకారం.
ఇందు మూలముగా సాధారణ ప్రజానికానికి తెలియచేయునది ఏమనగా ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెంజ్ సర్కిల్ శాఖ కు తనఖా పెట్టినారు, ఈ క్రింది ఉదహరించిన ఆస్తిని ఆధికృత అధికారి అయిన దిగువ సంతకందారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు స్వాధీనం చేసుకున్నారు, మీరు బ్యాంకుకు ది. 27-11-2023 తేది నాటికి బకాయి పడిన సొమ్ము రూ. 10,18,216/- (అక్షరాల పది లక్షల పద్దెనిమిది వేల రెండు వందల పదహారు రూపాయిలు మాత్రమే) మరియు వడ్డీ, ఇతర ఖర్చులు తిరిగి చెల్లించనందున ది.29-01-2025 తేది న అధికృత అధికారి అయిన దిగువ సంతకందారు ఇ-వేలం ద్వారా ఆస్తులను అమ్ముటకు నిర్ణయించడమైనది."ఎక్కడ ఏది ఉన్నదో అది" "ఎలా ఉన్నదో అలా " "అక్కడ ఏది ఉంటే అది" అనే ప్రాతిపదికన అమ్మబడును.

ఋణగ్రహీత(లు) మరియు హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) మెస్సర్స్ పద్మావతి జనరల్ ట్రేడర్స్ ప్రొ.జక్కిరెడ్డి నాగిరెడ్డి తండ్రి. జె. అంజిరెడ్డి 2) శ్రీ జక్కిరెడ్డి నాగిరెడ్డి తండ్రి. జె. అంజిరెడ్డి, డోర్ నెం. 41/25/1, బైరెడ్డి వారి స్ట్రీట్, కృష్ణలంక, విజయవాడ-13.
స్థిరాస్తి వివరములు: కృష్ణా జిల్లా, గన్నవరం మండలం గన్నవరం సబ్‌రిజిష్టరి, మడలవారిగూడెం పంచాయితీ, సూరంపల్లి గ్రామం & సూరంపల్లి శివారులో ఆర్.యస్.నెం.388/10, 388/11 2.18 సెంట్ల ఇళ్ళస్థలంలో విస్తీర్ణంలో 166.66 చ॥గ॥ల లేదా 139.37 చ॥అ॥ల స్థలం (ప్లాట్ నెం.18) శ్రీ జక్కిరెడ్డి నాగిరెడ్డి తండ్రి. జె. అంజిరెడ్డికి చెందిన ఆస్తి ఈ దిగువ హద్దులలో తూర్పు: ప్లాట్ నెం.21- 30అ॥ దక్షిణం: ప్లాట్ నెం.19- 50అ॥ పశ్చిమం:30అడుగుల వెడల్పు రోడ్, ఉత్తరం: ప్లాట్ నెం.17- 50అ॥. సేల్ డీడ్ నెం.1836/2013 తేది: 21-03-2013

రిజర్వు ధర రూ.7,50,000/- ధరావత్తుధర రూ .75,000/-

ఆస్థి అమ్మకం యొక్క నియమ నిభంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ www.unionbankofindia.co.in నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు ఆస్థి పరిశీలన కోసం అధీకృత అధికారి/చీఫ్ శ్రీమతి మనీషా ఠాకూర్ మేనేజర్‌ను సంప్రదించగలరు. ఫోన్:9326716091 (M), బ్రాంచ్ మెయిల్ ఐడి: ubin0816094@unionbankofindia.bank నందు చూడగలరు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదిన ఇ-వేలం అమ్మకము నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) క్రింద దీనిని నోటిసుగా పరిగణించవలెను.

తేది : 17-12-2024
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అదృశ్యమైన చిన్నారుల జాడను కనిపెట్టే యాప్

ప్రజాశక్తి-విజయవాడ : అంతవరకు సరదా సరదాగా గడిపిన ఆ కుటుంబంలో ఒక్కసారిగా పెద్ద అలజడి.. తమతో పాటు ఉన్న నాలుగేళ్ల చిన్నారి అకస్మాత్తుగా కనిపించకపోయే సరికి అంతులేని ఆవేదన! తిరిగి ఆ చిన్నారి చెంతకు చేరేవరకు ఒకటే కలవరం.. ఇలాంటి పరిస్థితులు ఉత్సవాల సమయాల్లో చూస్తుంటాం! ఇలా తప్పిపోయిన చిన్నారుల సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు సత్వరం తెలియజేప్పేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలతో శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎస్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు భవానీ దీక్షా విరమణలు జరగనున్నాయి.

గ్రామపంచాయతీ కార్యాలయం, కవుతరం

ఆర్.ఓ.సి. నెం. 2/2024 తేది : 20-12-2024

టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, కవుతరం గ్రామపంచాయతీకి 2025-26 సం॥నకు ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా కాంట్రాక్టు లేబరు పనులు ది. 01-4-2025 నుండి ది. 31-3-2026 వరకు అనగా ఒక సంవత్సర కాలమునకు పనిచేయుటకు ది. 26-12-2024వ తేదీ మధ్యాహ్నం 3 గం.లకు సీల్డు టెండర్లను పంచాయతీ కార్యదర్శి వారిచేగానీ వారి అనుమతి పొందిన వారిచేగానీ స్వీకరించబడును. సదరు టెండర్లు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో మధ్యాహ్నం 4 గం.లకు టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు ఆఫీసు పనివేళలలో తెలుసుకొనవలెను.

వ.నెం.	పనివివరము	ధరావత్తు
1.	పారిశుధ్యపనుల నిర్వహణకు (5) అయిదుగురు వ్యక్తుల సేవలు	రూ.1000/-
2.	మంచినీటి సరఫరా నిర్వహణకు (2) ఇద్దరు వ్యక్తుల సేవలు	రూ.1000/-
3.	వీధి విద్యుత్ దీపముల నిర్వహణకు (1) ఒక వ్యక్తి సేవలు	రూ.1000/-

గమనిక :
1) గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2) నిధుల నిల్వలను బట్టి పేమెంటు చేయబడును.
3) ధరావత్తు గానీ, హామీపత్రం గానీ సమర్పించవచ్చును.

సం/- అల్లపర్తి జయలక్ష్మి,
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, కవుతరం.
గుడ్లవల్లేరు మండలం.

సంక్షేమ బోర్డును కొనసాగించకుంటే ఉద్యమం

కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్



ధర్నా చేస్తున్న బిల్డింగ్ వర్కర్స్ నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కెవి గోపాలరావు హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని, 12 14 మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కెవి గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు సుదీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ప్రభుత్వాలు నిరుగర్చాయని దీనివల్ల కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు కుటుంబాలకు పెళ్లిళ్లకు ,డెలివరీ, హాస్పిట లై జేషన్కి, అంగవైకల్యానికి ,సహజ మరణానికి ప్రమాద మరణానికి ,ఆన్ రిజిస్టర్ మరణానికి అంత్యక్రియలకు సంక్షేమ బోర్డు నుండి వచ్చే ఆర్థిక సహాయం కార్మికులకు ఎంతో ఊరట కలిగించేదని అయితే గత వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా 12 14 మెమో తీసుకొచ్చి కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని కార్మికులకు అండగా ఉంటామని వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి గత ఆరు నెలలుగా ఒక్కసారి కూడా సంక్షేమ బోర్డు గురించి మాట్లాడలేదన్నారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన సిఐటియు జిల్లా అద్యక్షులు కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి, కూటమి ప్రభుత్వాలు కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్మికులు పొట్టగొడుతున్నాయన్నారు. సిటీ నాయకులు మాట్లాడుతూ నిర్మాణ రంగ కార్మికులు ఐక్యంగా ఉండి పోరాడితేనే ప్రభుత్వాలు దిగి వస్తాయన్నారు గతంలో ఉన్న వైకాపా ప్రభుత్వం నిర్మాణా రంగా కార్మికుల సమస్యలను గాలికి వదిలేసింది కాబట్టి తగిన గుణపాఠం చెప్పారని, కాబట్టి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డును కొనసాగించే వరకు పోరాటం కొనసాగించాలని సూచించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మీర్ అలీఅక్బర్, బిఎస్ రెడ్డి, కృష్ణారావు, ఎ.నాగేశ్వరరావు, కే వెంకటేశ్వరరావు, బి శ్రీనివాసరావు, రజాలు, హుస్సేన్, జె.పౌలు పాల్గొన్నారు.



నాంచారయ్యకు నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి: విశ్రాంత ఉపాధ్యాయులు వేములపల్లి వెంకట నాంచారయ్యకు సిపిఎం నేతలు నివాళులర్పించారు. స్థానిక మండల పరిధిలోని లక్ష్మీపురం శివారు రామనగరంలో గురువారం మృతిచెందిన విశ్రాంత ఉపాధ్యాయులు వేములపల్లి వెంకట నాంచారయ్య మృతదేహాన్ని శుక్రవారం సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.



రావి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ: నాయీ బ్రాహ్మణ రాష్ట్ర నాయకులు దేవరపల్లి కోటి ఆధ్వర్యంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ది గుడివాడ క్లబ్‌లో శ్రీసాయి నాయీ బ్రాహ్మణ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ రావి మరిన్ని పదవులను అలంకరించి పేదలకు అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రావి కలయికలతో గుడివాడ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అనంతరం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పోతురాజు, పానేశ్వరరావు, దుర్గారావు, సుబ్రహ్మణ్యం, రాఘువేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శ్రీనివాసలో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశకి-ఉయ్యూరు: ఏసుక్రీస్తు జననం ఒక నవశకానికి నాంది అని, మానవ చరిత్రలో ఒక మహోన్నత ఘట్టమైన ఆయన పుట్టిన రోజును క్రిస్మస్ పర్వదినంగా క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని శ్రీశ్రీనివాస విద్యాసంస్థల డైరెక్టర్ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. శ్రీశ్రీనివాస అక్షరాలయం ఆవరణలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. అప్పికట్ల ఫాస్టర్ స్పర్జన్రాజు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యార్థులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. అక్షరాలయం డైరెక్టర్ పరుచూరి నీలిమ, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



చిత్తూరు ఘటనపై యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తలుపులపల్లి జడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కెఎ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి షౌకత్ హుస్సేన్, బి.కనకారావు మాట్లాడుతూ పేపర్ లీక్ కాకుండా చూసుకోవడం పూర్తిగా ప్రభుత్వం బాధ్యత మాత్రమే అవుతుందని, ఉపాధ్యాయుల తప్పిదం కాదని అన్నారు. ప్రభుత్వం భవిష్యత్‌లో పరీక్ష పేపర్లను పాఠశాలకు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బయోలాజికల్ అసిస్టెంట్ సిద్దయ్య శెట్టి ఎంఆర్‌సి నుంచి సోషల్ క్వశ్చన్ పేపర్స్ తీసుకువస్తూ మరణించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని, అదేవిధంగా ప్రభుత్వ అధికారులు కక్ష ధోరణి మానుకుని ఎఫ్ఎల్ఎన్, లీడర్షిప్ ట్రైనింగులు రెసిడెన్షియల్‌గా ఎక్కడో దూరాన కాకుండా స్థానికంగా జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జె ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



జడ్‌పిటిసి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ (లచ్చి) జన్మదిన వేడుకలు శుక్రవారం అవనిగడ్డ వైసిపి కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు కేక్ కట్ చేయించి లక్ష్మీనారాయణకు తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ గ్రామ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, ఎంపీటీసీ తోట గణేష్, నాయకులు చెన్ను రంగారావు, సామర్ల రాముడు, గోపి, చింతలపూడి బాలు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుడివాడ

శనివారం గుడివాడ పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని మార్వాడి గుడి, శ్రీరామపురం, చేపల మార్కెట్, భీమేశ్వరస్వామి ఏరియా, ముబారక్ సెంటర్, బంటుమిల్లి రోడ్డులో కొంతభాగం, నెహ్రూచౌక్, 1టౌన్ పోలీసు స్టేషన్ నుండి శరత్ థియేటర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 8.30 నుండి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

యువత వినూత్నంగా ఆలోచించాలి : మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ

వినూత్న ఆలోచనలతో యువత పురోగతి సాధించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. చల్లపల్లికి చెందిన ప్రముఖ విజయ క్లినికల్ లేబరేటరీ అధినేత మంచి కంటి వెంకట సత్య కిరణ్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన ఆయుర్వేద సంబంధిత ఉత్పత్తులు విజయ బామ్ పెయిన్ రిలీఫ్ ఆయిల్, సమ్మర్ టాల్కం పౌడర్ లాంటి ఉత్పత్తులను శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న తరహా కుటీర పరిశ్రమలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. యువతను ప్రోత్సహిస్తే పది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ఇలాంటి కుటీర పరిశ్రమలు మరిన్ని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల రాజకీయ కమిటీ చైర్మన్ జల్లూరు ప్రసాద్, కొత్త శ్రీనివాసరావు చిట్టా బాబ్జి, పీటర్ టిడిపి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటరావు, అఖిల భారత దళిత చైతన్య వేదిక అధ్యక్షులు బుల్లా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్పత్తులను విడుదల చేస్తున్న మండలి బుద్ధప్రసాద్

ఆగిరిపల్లి రోడ్లో చెత్త డంపింగ్‌తో సమస్యలు

ప్రజాశక్తి-గన్నవరం: ఆగిరిపల్లి రోడ్డులో చెత్త డంపింగ్ సమస్య తీరడం లేదు. రోజురోజుకు చెత్త పెరుగుతుంది. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు మారినా సమస్యలు పరిష్కారం కావడంలేదు. చెత్త సమస్యను నివారించేందుకు స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మూడు పంచాయతీల మీద రూ.56 లక్షల నిధులతో వాహనం కొనుగోలు చేశారు. ఈ వాహనం వల్ల చెత్త పూర్తిగా తరలించే అవకాశం లేదు. పంచాయతీలో రెండు ట్రాక్టర్లు ఉండి కూడా బయటకి తరలించే ప్రయత్నం చేయడంలేదు. దీంతో చెత్తను తగులబెట్టడంతో దాని నుంచి వస్తున్న పొగతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ సమస్యపై సత్వరమే దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): భారతీయ జీవిత భీమా ఏజెంట్స్ ఆర్గనైజషన్ అఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం అసోసియేషన్ ఆద్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం డివిజన్ కార్యాలయం ఎదుట సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గాంధీ రామ్మోహన్, కె.రాజారావు, ఉపాధ్యక్షులు, ఉదయలక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, కెఆర్ గుప్తా, భాస్కరరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



70 మందికి దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి: పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆనందోత్సాహాల నడుమ పండుగ వాతావరణంలో సమాధాన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కే కొత్తపాలెం కృష్ణానది తీరంలో ఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం రాత్రి పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ నిర్వాహకులు బుర్రె శాంసన్ పర్యవేక్షణలో సెమీ క్రిస్మస్ లో భాగంగా సమాదాన వేడుకలు అంబరాన్ని అంటాయి. చిన్నారులు ఏసుక్రీస్తు పాటలకు డ్యాన్సులు అలాగే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా 70 మందికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విజన్ సన్ వెస్లీ, బిషప్ శాంసన్ సతీమణి ప్రభు కుమారి, హెబ్సిబా విజన్ సన్, మోపిదేవి మండల పాస్టర్స్ యూనియన్ అధ్యక్షులు గుర్రం ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.





విద్యా సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి - తిరువూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఆరు నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఇంగ్లీష్ పరీక్ష పేపర్లను తయారు చేయాలని, విద్యార్థుల్లో దేశ భక్తి, సోదర భావం పెంచడానికి భారతదేశం –నా మాతృభూమి ప్రతిజ్ఞ రాసిన పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని, పాఠ్య పుస్తకాల్లో స్థానిక అంశాలకు చోటు కల్పించేందుకు కృషి చేయాలని తిరువూరుకు చెందిన ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్ ఎం.రాంప్రదీప్ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థకు చెందిన ఆంగ్ల అధ్యాపక బృంద సభ్యులు ఎం.ఎస్.ఎస్.మాధవిదేవి, ఎం.చంద్రశేఖర్‌ను తదితరులను కోరారు. శుక్రవారం విజయవాడలోని ఎస్.సి.ఇ.ఆర్.టి కార్యాలయంలో ఆంగ్ల నిఘంటువులపై జరిగిన కార్యశాలలో పాల్గొన్న రాం ప్రదీప్ ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయిని కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజలపై విద్యుత్ బిల్లుల భారాలను నిలుపుదల చేయాలని, ట్రూ అప్ ఛార్జీల, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం తూర్పు నగర కమిటీ సభ్యులు యన్.నాగేశ్వరరావు అన్నారు. సిపిఎం తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో 15వ డివిజన్‌లో ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పెరిగిన విద్యుత్‌బిల్లులను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా యన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ట్రూప్ ఛార్జీల పేరిట ప్రజలపై భారాలు మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ సర్దుబాటు ఛార్జీలతో పాటు అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రీపెయిడ్ కరెంటు స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జి.కె. ప్రసాద్, గణేష్, నాగబాబు, సాయి, శాంతి, ఆశ, లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలు పరిశీలన

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో ఉద్యాన అధికారి నరేంద్ర కుమార్ మామిడి తోటలను పరిశీలించి ఆకాల వర్షాల వల్ల మామిడి రైతులు పచ్చి పూత ఉన్న రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తెల్లపూత ఉన్న రైతులు బైటాక్స్‌ను 1 గ్రా/లీ, లేదా ప్రొపినాబ్ 1.5 గ్రా/లీ స్ప్రే చెయ్యాలని రైతులకు సూచించారు. ఇప్పుడు అక్కడక్కడ నల్ల తామర పురుగులు కూడా కనిపిస్తున్నాయని వీటి ఉధృతిని పసిగట్టడానికి ముందుగా నీలంరంగు అట్టలతో వీటిని కనిపెట్టవచ్చని తెలిపారు. సాయంత్రం మంటలు పెట్టడం వల్ల పెద్ద పురుగులు మంటల్లో పడి చనిపోతాయని ఇక రసాయనాల్లో ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ ఒక వారం తర్వాత థయోమిథాక్సిమ్ 0.5గ్రా/ లీ స్ప్రే చెయ్యాలి. ఎఫ్‌పిసి సెంటర్ నుంచి నీలం రంగు అట్టలు పసుపు రంగు అట్టలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మామిడి పంట బీమా పథకాన్ని ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్టు చెప్పారు. రైతులు త్వరపడాలని వివరించారు. ఎఫ్‌పిసి సెంటర్‌లో నీలం, పసుపు అట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండపల్లి పరమేశ్వరావు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు రామారావు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు పాల్గున్నారు



నీలం పసుపు అట్టలను పంపిణీ చేసిన దృశ్యం

శిఖర్ పురస్కార అవార్డుకు 'చైతన్య' ఎంపిక

ప్రజాశక్తి - నందిగామ : దేశంలోనే ప్రఖ్యాత అడ్మిషన్స్ ఆరో సంస్థ ఆధ్వర్యంలో ఐఐటి, ఎన్ఐటి సీట్ల సాధనలో ముందుండే ప్రఖ్యాత విద్యాసంస్థలకు ఇచ్చే ప్రైడ్ అవార్డుకు నందిగామ చైతన్య ఐఐటి అకాడమీ ఎంపికైంది. విజయవాడలో అత్యంత భారీ స్థాయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కార్తీక్ అమరనేని, శాంతి ప్రత్యూష ఎంఎల్ఏ గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా శిఖర్ పురస్కార అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ వారు మాట్లాడుతూ నందిగామలోనే కాకుండా రాష్ట్రస్థాయిలోనే ఎన్ఐటి ఐఐటి సీట్ల సాధనలో చైతన్య ఐఐటి అకాడమీ ముందువరుసలో ఉందని, ఎన్నో గణాంకాల ఆధారంగా చైతన్య ఐఐటి అకాడమీని ఈ అవార్డుకు ఎంపిక చేసామని తెలిపారు. అవార్డు గ్రహీత కార్తీక్ అమరనేని మాట్లాడుతూ గ్రామీణ స్థాయి అయిన నందిగామలో ఐఐటి,ఎన్ఐటి,నీట్ సీట్ల సాధన కొరకు ప్రారంభించబడిన చైతన్య ఐఐటి నీట్ అకాడమీ ఈ ప్రఖ్యాత అవార్డుని గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మట్టిలో మాణిక్యాల వెలికితీస్తూ గ్రామీణ విద్యార్థులను జాతీయస్థాయిలో నిలబెట్టడమే తమ ఆకాంక్ష అని, ఐఐటి, ఎన్ఐటి సీట్ల సాధనే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.



అట్టహాసంగా పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అట్టహాసంగా 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి హాజరయ్యారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి తదుపరి క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. తంగిరాల సౌమ్య మాట్లాడుతూ యువత భవిష్యత్తు అంతా డీప్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ) లాంటి నూతన సాంకేతికతల పైనే ఆధారపడి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఐటిని ప్రమోట్ చేసేందుకు సిఎం చంద్రబాబు హైటెక్ సిటీ నిర్మించారని తెలిపారు. పోటీల్లో గెలుపోటములు సహజమని వైఫల్యమే జీవితానికి కావలసిన పాఠాలను నేర్పిస్తుందని, గొప్ప విజయాలకు బాట వేసేది కూడా వైఫల్యాలే అని, విఫలం చెందిన వ్యక్తికే విజయం ఎంత గొప్పదో, దాన్ని సాధించడం ఎంత కష్టమో అర్థమవుతుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలకు రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, శంకుస్థాపన చేస్తామని స్పష్టం చేశారు. కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ముందుకొచ్చిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ వేడుకలు ప్రారంభిస్తున్న సౌమ్య

హైకోర్టు ఆటల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - భవానీపురం : రాష్ట్ర హైకోర్టు 2023–24 సంవత్సరానికి గానూ నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజయవాడ విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ అన్వర్ షేక్ సత్తా చాటారు. ఈ క్రీడా పోటీల్లో కబడ్డీ, రన్నింగ్, డిస్కస్ త్రో వంటి వివిధ విభాగాల్లో పాల్గొని, పలు బహుమతులను గెలుచుకున్నారు. ప్రత్యేకంగా కబడ్డీ, రన్నింగ్, డిస్కస్ త్రో పోటీలలో డాక్టర్ అన్వర్ షేక్ 30 గ్రాముల రజత నాణేలు, మెమెంటోలను గెలుచుకోవడం ద్వారా తన క్రీడా ప్రతిభను చాటుకున్నారు. ఈ బహుమతులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రాంగణంలో శుక్రవారం జరిగిన వేడుకలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్, సీనియర్ న్యాయవాది పట్టాభి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీలైన కబడ్డీ, రన్నింగ్, డిస్కస్ త్రో వంటి ఈవెంట్లలో బహుమతులు గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ క్రీడా పోటీలు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె. చిదంబరం ఆధ్వర్యంలో, సంఘం కార్యనిర్వాహణ కమిటీ ఏర్పాటులో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. హైకోర్టు న్యాయమూర్తులు నైనాల జైసూర్య, కె.సురేష్ రెడ్డి, రవిచీమలపాటి, సుమతి జగదామ్, బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తి, ముఖ్య అతిథిగా బి. కృష్ణమోహన్ పాల్గొని న్యాయవాది అన్వర్ షేక్‌ను అభినందించారు.



హైకోర్టు జస్టిస్ బి. కృష్ణమోహన్ చేతుల మీదుగా మెమొంటో అందుకుంటున్న అన్వర్ షేక్

పోక్సో కేసులో జైలు

ప్రజాశక్తి - విజయవాడ : మైనర్ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితునికి ఐదు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నున్న పోలీసు స్టేషన్ లో నమోదైన క్రైమ్ నెం: 377/2016 యు/ఎస్ 354 ఐపిసి అండ్ సెక్షన్ 7 అండ్8 ఆఫ్ పోక్సో యాక్ట్ కేసులో నిందితుడైన పుల్లేటికుర్తి భువన చంద్ర అలియాస్ బోగేష్‌పై నేరం రుజువైనందున శుక్రవారం విజయవాడ పోక్సో కోర్ట్ జడ్జ్ వి.భవాని నిందితునికి ఐదుసంవత్సరాలు కఠినకారాగార శిక్ష, రూ.15వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిర్యాది నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో పాయకాపురం ఏరియాలో తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఫిర్యాది తన కుమార్తె ఏపీఎస్ రెడ్డి రోడ్డులోని ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. పాఠశాల యాజమాన్యం వారు భువన చంద్ర అనే వ్యక్తి ద్వారా పిల్లలకు రైటింగ్ కోర్స్ ఏర్పాటు చేసినట్టు, ఆ కోర్సుకు ఫిర్యాది పాప కూడా వెళ్లింది. చివరి రోజు 2016 నవంబర్ 3న తేదీన సాయంత్రం సమయంలో రైటింగ్ కోర్స్‌లో పరీక్ష నిర్వహించిన్నట్లు, ఆ సమయంలో బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఎవరితోనైనా చెపితే చంపుతాను అని బెదిరించాడు. సదరు బాలిక ఇంటికి వచ్చి జరిగిన విషయం ఫిర్యాదికి చెప్పగా వెంటనే స్కూల్ వారితో కలిసి నున్న పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశారు.అప్పటి నుంచి దర్యాప్తులో ఉన్న ఈ కేసులో నిందితుడిని నేరం రుజువవడంతో జైలు, జరిమానా విధించారు.

ప్రసాదాలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ కనకదుర్గ భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో 24 సంవత్సరాలుగా భవానీలకు, అయ్యప్పలకు, శివ స్వాములకు, భక్తులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ కనకదుర్గ భవానీ సేవా సమితి నిర్వాహకులు పిళ్ళా దుర్గారావు తెలిపారు. శుక్రవారం ఆంజనేయ వాగులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భవానీ దీక్షలు పూర్తి చేసుకొని గిరి ప్రదక్షిణ చేసేటువంటి భవానీలకు భవానీ భక్తులకు ఈనెల 21 నుండి 25వ తేదీ వరకు ప్రతిరోజు యాత్రికులు పండ్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ సంవత్సరం 25వ సంవత్సరం సందర్భంగా కార్యక్రమాన్ని మరింత బాగా చేయాలనే తలంపుతో బంగారయ్య కొట్టు సెంటర్ వద్ద అమ్మవారి భారీ సెట్టింగ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

అన్నదాత మహోత్సవం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్, విజయవాడ నార్త్ – 3 ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య సమాజ మందిరంలో శుక్రవా రం అన్నదాత మహోత్సవం నిర్వహించారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ఆటు పోట్లు, పంట వేసిన దగ్గరనుండి దిగుబడి, ఎగుమతి, బ్యాంకు ద్వారా అందచేస్తున్న రుణాలు, సబ్సిడీ, ఇన్సూరెన్స్ వంటి సదుపా యాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ విజయవాడ జోనల్ అధికారులతో పాటు తిరువూరు బ్రాంచ్ మేనేజర్ పి.రవికుమార్, వ్యవసాయ శాఖ అధికారి పి.పద్మ, రైతులు పాల్గొన్నారు.



క్రిస్మస్ సందేశం ఇస్తున్న జడ్జి లక్ష్మీ రాజ్యం

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందిగామ కోర్టు ఆవరణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మీ రాజ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి అద్దంకి మణిబాబు, ఉపాధ్యక్షులు కూరగంటి కృష్ణంరాజు, సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంత రావు, లైబ్రరీయన్ విజయ్, లేడీస్ రిప్రజెం టేటివ్ కురగంటి ప్రవీణ, నందిగామ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ న్యాయవాదుల అధ్యక్షులు చెరుకుమల్లి రామారావు, జగ్గయ్య పేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నే పాక సుందర రావు, సిఎస్ఐ చర్చ్ పాస్టర్ చంద్రశేఖర్, సీనియర్ జూనియర్ న్యాయ వాదులు సుంకర సూర్యనారాయణ, బం దలపాటి రామకష్ట, జిల్లా కోర్టు సూపరిం టెండెంట్ జీవనజ్యోతి, తదితరులు పాల్గొని క్రీస్తు జననం బోధనల గురించి వివరించారు.

22న జీ తెలుగు ప్రత్యేక కార్యక్రమం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : వినోదంతోపాటు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలతో అలరించే జీ తెలుగు ఈ సంవత్సరం జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22 న 35 చిన్న కథ కాదు సినిమా ప్రసారం చేస్తున్నట్లు ఛానల్ ప్రతినిధి కె.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని ఛానల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్రానికి చేసిన సేవలను స్మరించు కుంటూ ఆయనకు నివాళు లర్పిస్తోందన్నారు. 35 చిన్నకథ కాదు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ డిసెంబర్ 22న (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటలకు.. జీ తెలుగులో మాత్రమే ప్రసారమవుతుందని తెలిపారు. గణిత శాస్త్రంలో అంకెలు సృష్టించే మాయాజాలం, ఆకట్టుకునే కథాంశంతో మేళవించిన అసాధారణ కథతో రూపొందిన ఈ సినిమాకి నందకిషోర్ ఈమని దర్శకత్వం వహించారన్నారు. ఈ సినిమాలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ రాచకొండ, గౌతమి కీలక పాత్రలు పోషించారు. ఎమోషనల్ అండ్ ఫ్యామిలీఎంటర్టైనర్గా అలరించిన 35 చిన్న కథ కాదు సినిమాని జీ తెలుగు వేదికగా ప్రసారం అవుతుందని అన్నారు.

పక్కా డ్రెయిన్లు నిర్మించేనా..?

గన్నవరంలో రోడ్డుపైనే మురుగునీరు



గన్నవరంలో రోడ్డుపై నిలిచిన నీరు

ప్రజాశక్తి-గన్నవరం: నియోజకవర్గ కేంద్రం గన్నవరం గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. గ్రామంలో 22 వేల జనాభా ఉంది. డ్రెయినేజీలు లేకపోవడంతో చినుకు పడితే చాలు గ్రామంలోని ప్రధాన రోడ్లు నీట మునిగిపోతున్నాయి. రోడ్లపై మురుగు నీరు నిలిచిపోవడంతో గ్రామ స్తులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజీ లేకపోవడం తో వర్షం చినుకు పడితే గ్రామంలో ఉన్న డ్రెయినేజీ మురుగునీరు నేరుగా వచ్చి ప్రధాన రహదారిపై నిలిచిపోతుంది. మురుగు నీరు పారుదల లేకపోవడంతో పక్కనే ఉన్న తోడేపాడు లోకి మురుగునీరు చేరింది. గ్రామంలో డ్రెయినేజీ సమస్య చాలా తీవ్రంగా ఉన్నా.. ఇప్పటి వరకు అటు అధికారులు కానీ, ఇటు పాలకులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదనే వాదన ఉంది. గ్రామంలో మురుగునీరు కారణంగా గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారు. అంతర్గత డ్రెయినేజీల నుంచి వచ్చే మురుగునీరు నేరుగా ప్రధాన రహదాకి వద్దకు చేరుకుంటోంది. అయితే ప్రధాన రహదారికి పక్కా డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతుంది. వర్షం పడితే మోకాటి లోతు నీరు ప్రధాన రహదారిపై ఉండిపోతుంది. హైస్కూల్ సెంటర్ నుంచి డ్రెయినేజీ నీరు పారుదలకు మార్గం లేక ఈ సమస్య తలెత్తుతోంది. దీంతో జెండా చెట్టు నుంచి గుడి వరకు డ్రెయినేజీ నీరు ప్రధాన రహదారిపై నిలిచి పోతుంది. గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు పడినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. డ్రెయినేజీల పరిస్థితి ఇలాగే ఉంటే గ్రామంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ముస్లిం పేట, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ ఏరియాలో పరిస్థితి దారుణంగా ఉంది. రాయనగర్ రామనగర్‌లోను డ్రెనేజీల్లో నీరు ఆగిపోతుంది. ప్రజారోగ్యం పడకేస్తుంది. దోమలు, ఇతర కీటకాలు విజృంభిస్తున్నాయి. మురుగునీరు పారుదలకు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ చర్యలు శూన్యం

పక్కా డ్రైనేజీ నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా రిక్తహస్తాలు చూపించింది. మురుగునీటి సమస్య పరిష్కారం కావాలంటే గ్రామంలో పక్కా డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలి. దాదాపు రెండు కిలోమీటర్ల వరకు డ్రెయిన్లు నిర్మించాలి. అలాగే ఊర చెరువు పక్క నుం చి ఉన్న కాలువను ఆధునికీకరించి మురు గునీరు ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. అయితే ఈ ప్రాంత రైతులు అభ్యంతరం చెబుతున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం వెం టనే పరిష్కరించాలి. అయితే కూటమి ప్రభుత్వం డ్రెయినేజీ నిర్మాణంపై ఇప్పటివ రకు ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేయలేదు. అభివృద్ధే ఊపిరని చెప్పుకుంటున్న పాలకులు డ్రెయినేజీల విషయంలో చర్యలు తీసుకోవడం లేదనే విమర్శ ఉంది. వచ్చే వర్షాకాలం నాటికైనా డ్రెయినేజీల నిర్మాణం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

డ్రెయినేజీలు అత్యవసరం: సిపిఎం

గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే డ్రెయినేజీల నిర్మాణం అత్యవసరమని సిపిఎం నాయకులు సురగాని సాంబశివరావు అన్నారు. రోడ్డు పైనే మురుగునీరు నిలిచిపోతుంది. చెరువులు కూడా కలుషితంగా మారాయి. అనారోగ్య వాతావరణం ఏర్పడుతోంది. ఆగిరిపల్లి రోడ్డులో చెత్త సమస్య పెద్ద ఇబ్బందిగా తయారైంది. అధికారులు వెంటనే స్పందించాలి.




సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక ఎఎఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ హైస్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మ పుట్టుక, నీతి సూత్రాలను అభ్యుదయ హై స్కూల్ హెచ్ఎం జి.కిషోర్‌బాబు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాతులూరి లీనా, డైరెక్టర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

బియ్యం అక్రమాలపై పేర్ని సమాధానం చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గోదాముల్లో బియ్యం అక్రమాలపై పేర్ని నాని సమాధానం చెప్పాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో శు క్రవారం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ పేర్ని నాని గత ఐదేళ్లలో ఎంత ప్రజాధనం దోచుకున్నాడో గోదాముల్లోని బియ్యం అక్రమాలు బట్టబయలు చేస్తున్నాయన్నారు. రూ.1.70 కోట్లు ప్రభుత్వానికి చెల్లించడమంటే అక్రమాలను ఒప్పుకున్నట్లేనన్నారు. అప్పటికప్పుడు రెండు కోట్లు కట్టడం వెనుక ఎంత దోచుకున్నారో అర్థమవుతోందన్నారు. గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై అధికారులు విచారణ జరిపించాలన్నారు. ఈ సమావేశంలో టౌన్ సెక్రటరీ వెంకన్న, ప్రెసిడెంట్ ఇలియాస్ బాష ,మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, ఆరో డివిజన్ ఇంచార్జ్ దిలీప్, పిప్పళ్ల కాంతారావు (వెంకన్న), బొడ్డు నాగరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో సత్యనారాయణకు బంగారు పతకం



ప్రజాశక్తి-గుడివాడ: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీలలో ఎన్‌టిఆర్ స్టేడియం క్రీడాకారుడు జి.సత్యనారాయణ బంగారు పతకం సాధించడం అభినందనీయమని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శులు యలవర్తి శ్రీనివాసరావు, కిలారపు రంగప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో బంగారు పతకం సాధించిన సత్యనారాయణను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో సత్యనారాయణ 74 కిలోల శరీర బరువు విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో 225 కేజీలు బరువును ఎత్తి బంగారు పతకం సాధించడం స్టేడియంనకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, స్టేడియం మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి: పల్లె పండుగ కార్యక్రమం పల్లె ప్రగతికి బాటలని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. శు క్రవారం చల్లపల్లి నారాయణరావునగర్ కాలనీలో గురుకుల పాఠశాల సమీపంలో ఉపాధి హామీ నిధులు రూ.7.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈఈ బొప్పన శ్రీనివాసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కొండేటి భవానీ సాయి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం:** గన్నవరంలోని చెంచుల కాలనీ బజారులో రోడ్డు నిర్మాణానికి శుక్రవారం గన్నవరం గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతుందని అన్నారు. అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు, పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



ప్రజాశక్తి-కోడూరు: రామకృష్ణాపురంలో శుక్రవారం కోడూరు తాసిల్దార్ శ్రీనునాయక్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొన్న అన్ని రకాల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో మొత్తం 14 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి దేవనబోయిన వెంకటేశ్వరరావు, కోడూరు-2 నీటి సంఘం అధ్యక్షులు గంజాల సుందరరావు, అద్దంకి పాండు రంగారావు, కోట రాంబాబు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు తదితరులు పాల్గొన్నారు. **పమిడిముక్కల:** రైతుల సమస్యలు తీర్చడానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని పమిడిముక్కల తాసిల్దార్ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల గ్రామ పంచాయతీ వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం పది అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముళ్లపూడి సునీత, గ్రామ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-గుడివాడ : సిపిఐని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ ఈ నెల 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలను గుడివాడ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలన్నారు. ఏఐటియుసి 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, పేదల ఇళ్లస్థలాలు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై పార్టీ పిలుపుమేరకు పోరాటాలు చేయాలన్నారు. అనంతరం షేక్ మోసకు సిపిఐకండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా నాయకులు కె.సురేష్, స్వామి, అంజి, పద్మారావు, రంగారావు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న తాతయ్య

జాతీయ పురస్కారానికి సెయింట్ జోన్స్ ప్రిన్సిపల్ ఎంపిక

ప్రజాశక్తి-బంటుమిల్లి: బంటుమిల్లిలోని సెయింట్ జోన్స్ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎ.జాన్సీసాబు సావిత్రీ బాయ్ పూలే జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. గత 17 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత విద్యా రంగంలో విశేష కృషి చేస్తూ అనేక మంది విద్యార్థుల ఉన్నతికి తోడ్పడుతూ గ్రామీణ విద్యార్థులను కార్పొరేట్ విద్యార్థులకు ధీటుగా తీర్చిదిద్దుతున్న ఆమె సేవలను గుర్తిస్తూ సావిత్రి బాయ్ పూలే జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సౌత్ రన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జనవరి 5న గుంటూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పురస్కారాన్ని అందుకోనున్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన జాన్సీసాబుకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, స్కూల్ డైరెక్టర్ సాబుజాన్ అభినందనలు తెలిపారు.



సచివాలయ భవనం పరిశుభ్రం

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలోని సచివాలయం గదులలో మద్యం సేవించి ఖాళీ సీసాలు గదులలో పడవేసి ఉండటంతో దీనిని పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పంచాయతీ అధికారులను తీవ్రంగా హెచ్చరించడంతో వారు యుద్ధ ప్రాతిపదికన శుక్రవారం పంచాయతీ గదులను పరిశుభ్రం చేసే చర్యలు చేపట్టారు. కార్యాలయం ఇన్చార్జి ఈవో అనిత ఆధ్వర్యంలో సిబ్బంది గదులను పరిశుభ్రం చేయడంతో పాటు కార్యాలయం భవనం చుట్టూ బయట వారు కార్యాలయంలోకి ప్రవేశించకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేశారు. వెనకవైపు గేటు మూసివేయడంతో పాటు సరిహద్దు గోడ విరిగి ఉన్న ప్రాంతంలో పరదాలను అడ్డంగా కట్టించారు.



చేపలు, రొయ్యల ఉత్పత్తుల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-నాగాయలంక: కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో భావదేవరపల్లి గ్రామంలో చేపలు, రొయ్యలు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.డి.సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన పెంచుకునేందుకు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీ మండలి వెంకటకృష్ణారావు మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.చంద్రశేఖరరావు మాట్లాడుతూ మహిళలు చేపలు, రొయ్యలు విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా చేపలు రొయ్యలు అందుబాటులో ఉండని కాలంలో వాటిని ఆహారంలో భాగం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల శాస్త్రవేత్త డా.జె.యశ్వంత్‌కుమార్, డా.ఆశ్రీత, డా.విశాల్‌కుమార్, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, డా.రేవతి పాల్గొన్నారు.





ఇంధనం పొదుపు చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇంధనాన్ని పొదుపుగా వాడటం ద్వారా భావితరాలకు భవిష్యత్తును ఇద్దామని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం ఎనర్జీ మేనేజర్ బి.హరి పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ అధికారులు స్థానిక డా.జాకీర్ హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల సహకారంతో కళాశాల ఆవరణలో అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బి.హరి మాట్లాడుతూ యాంత్రీకరణ బాగా పెరిగినందున సహజవనరులు తరిగి పోతున్నాయన్నారు. ప్రజలు ఇంధన పొదుపుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్ ఇంటెండెంట్ ఇంజనీర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతిచోటా ఫైవ్ స్టార్ రేటింగ్ కలిగిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఉపయోగించి విద్యుత్‌ను పొదుపు చేయాలన్నారు. డాక్టర్ ఎన్‌డిటిపిఎస్ డిప్యూటీ సెక్రటరీ సుశీల మాట్లాడుతూ మనదేశంలో ఉన్న పెట్రోలు, డీజిల్ ఇదేవిధంగా ఉపయోగిస్తే మరో 15 సంవత్సరాలకు పూర్తిగా అడుగంటి పోతాయన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన డిగ్రీ విద్యార్థులు వి.సన్నీ, ఎం.సుధామయి, ఎస్.కె ఖాజావలి, కె.అభిచందన్, జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్.కె.జుబేదా, ఎం.ప్రమీల, ఎస్.కె.హుస్సేన్, మహబున్నిలకు మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ మస్తాన్‌వలి, జాఫర్ సాదిక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాగుల్ మీరా, అధ్యాపకులు బందగి బేగ్, రాము, సంతోష్, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పట్ల హర్షం



ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎన్నికల ముందు టిడిపి ఇచ్చిన హామీలు ప్రకారంగా ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం పథకాన్ని కొనసాగించినందుకు చంద్రబాబుకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్.బేగ్ శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో నిధులు లేని మైనారిటీ కార్పొరేషన్లు, చైర్మన్లు ఇచ్చి ముస్లిం మైనారిటీలను అపహాస్యం చేశారని అన్నారు. ముస్లిం మైనారిటీలు ఎం.ఏ.షరీఫ్‌ని ప్రభుత్వ మైనారిటీ సలహాదారులుగా, అబ్దుల్ అజీజ్‌ను రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా, మౌలానా ముస్తాక్ అహ్మద్‌ని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌లుగా నియమించడం హర్షం వ్యక్తంచేశారు.



తహశీల్దార్ రాజకుమారికి అర్జీ అందజేస్తున్న దృశ్యం

రెవెన్యూ సదస్సులో 31 అర్జీలు

ప్రజాశక్తి - గంపలగూడెం: శుక్రవారం అనుముల్లంక గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 31 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. ఆర్ఆర్ కింద 12 సర్వేకి 19 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజకుమారి మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు తమ భూముల పత్రాలను పరిశీలన చేసుకోవాలని తెలిపారు. సమస్యలుంటే తమ దృష్టికి తెచ్చి సత్వర పరిష్కారాన్ని పొందాలని సూచించారు.

గ్రామాలకు తాగునీరందిస్తాం : ఎంఎల్ఎ శ్రీరాం



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : గ్రామాలకు తాగునీరందిస్తామని ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. కనుచూపుమేరలో నీళ్ల ఉన్నప్పటికీ తాగటానికి నోచుకోని రావిరాల గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ గ్రామానికి నీరిచ్చేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, గ్రామస్తులతో కలిసి కృష్ణానది లోపల సరైన ప్రదేశం కోసం పరిశీలించి అంచనాలను తయారు చేయాలని సూచించారు. రావిరాల గ్రామంతో పాటు జయంతిపురం, చిల్లకల్లు గ్రామాలకు కూడా దాన్ని విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అందుబాటులో ఉన్న నిధులతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మంజూరు చేయించి గ్రామాలకు నీటిని అందిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలని నిరసన



విస్సన్నపేటలో ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఇటీవల రాజ్యసభలో అమిత్ షా అంబేద్కర్ పేరును ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడడానికి నిరసనగా శుక్రవారం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా డా.అంబేద్కర్ పేరును అవమానిస్తూ పార్లమెంట్లో మాట్లాడటం భారత జాతి మొత్తాన్ని అవమానించడమే కేంద్ర హోం మంత్రి మాటల్లో అంబేద్కర్ నామవాచకంపై వ్యంగం ధ్వనిస్తుందన్నారు.

విస్సన్నపేట : విస్సన్నపేట అంబేద్కర్ సెంటర్‌లో దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో బిజెపి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నిండు సభలో పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవహేళన చేసి అవమానపరిచిన మాటలను వెనక్కి తీసుకొని అదే నిండు సభలో క్షమాపణ చెప్పాలని దళిత సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు, బిసి సంఘం నాయకులు, ప్రముఖ న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు, పోలంపల్లి రాధమ్మ, సైదాబి, నియోజకవర్గం బిఎస్‌పి అధ్యక్షులు కె.వి.రత్నం పాల్గొన్నారు.

విస్తరణ పేరుతో ఇళ్ల తొలగింపునకు యత్నం

అడ్డుకున్న బాధితులు - తాత్కాలికంగా నిలిపిన అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న బాధితులు

ప్రజాశక్తి - కంచికచర్ల : రోడ్డు విస్తరణ కోసమంటూ సూర్యుడు ఉదయించకముందే అధికారులు కంచికచర్లలో పేద దళితుల ఇల్లు కూల్చివేతలను బాధితులు అడ్డుకున్నారు. నిద్ర లేచేసరికే స్థానిక చెవిటికల్లు రోడ్డులో అంబేద్కర్ కాలనీలో రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించేందుకు ఆర్అండ్‌బి అధికారులు రెవెన్యూ పోలీస్ సిబ్బందితో కలిసి వచ్చి ఇళ్ల తొలగింపునకు సిద్ధమయ్యారు. దీంతో ఒక్కసారిగా ఖంగుతిని భయాందోళనకు గురైన బాధితులు ఇల్లు కూల్చివేతలను నిలిపివేయాలని అధికారులను అడ్డుకొని ఆందోళనకు దిగారు. స్థానిక చెవిటికల్లు రోడ్డు విస్తరణకు నాబార్డ్ నుండి నిధులు మంజూరుకు నాబార్డుకు ప్రతిపాదనలు పంపామని, నాబార్డు ఆదేశాలతో రోడ్డు విస్తరణకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని ఈ నెల 19న సాయంత్రం అధికారులు మైక్‌లో ప్రచారం చేశారు. కొద్ది గంటల వ్యవధిలోనే శుక్రవారం ఉదయాన్నే ఆర్అండ్‌బి డిఇ ఫణిభూషణ్ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలిసి జెసిబితో ఇల్లు తొలగింపునకు సిద్ధమయ్యారు. రోడ్డుకిరువైపులా 30 ఏళ్లు నివాసాలు ఏర్పరుచుకొని, ఇంటి పన్ను, కైలాయి పన్ను, కరంటు పన్ను చెల్లిస్తున్నా, బాధితులకు ఎక్కడా ప్రత్యామ్నాయం చూపకపోగా, కనీసం ఇంట్లో సామాను కూడా ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియని స్థితిలో ఉంటే, అధికారులు హడావుడిగా ఇళ్ల తొలగింపునకు సిద్ధమవటంతో బాధితులు అడ్డుకున్నారు. ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను వదిలి, పేద దళితుల ఇల్లు తొలగింపు ఎవరి మెప్పుకోసమని బాధిత మహిళలు అధికారులను నిలదీశారు. కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా సమయం ఇవ్వకుండా ఇళ్ల కూల్చివేస్తే ఊరుకునేదిలేదని ఆందోళనకు దిగారు. అధికారులతో వాగ్వివాదానికి దిగి, గోడు వెళ్లబుచ్చుకున్నారు. ప్రజా ప్రతినిధులు సైతం తమ గోడు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 3 గంటల పాటు బాధితులు ఆందోళన చేపట్టి, ఇళ్ల తొలగింపును అడ్డుకున్నారు. బాధితులకు సిపిఎం నాయకులు ఎం.సోమేశ్వరరావు, గోపి నాయక్, బిఎస్‌పి ఎంపిటిసి బర్రె ఉదయ్ కిరణ్ మద్దతు తెలిపారు. ఆక్రమణల పేరుతో దళితుల ఇళ్ల కూల్చి వేతలను ప్రభుత్వం నిలుపుదల చేయాలని, బాధితులకు ప్రత్యామ్నాయం చూపేవరకు, ఇళ్ల కూల్చివేతలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బాధితులు అధికారులకు అందజేశారు. దీంతో తాత్కాలికంగా పనులు నిలిపేశారు.



ఇళ్లను తొలగించేందుకు రప్పించిన పొక్లెయినర్లు

తాళ్లాయిపాలెం పీఠానికి కోటిలింగ క్షేత్రం అప్పగింత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల శ్రీ కామాక్షి సమేత పంచముఖ అమృత లింగేశ్వర కోటి లింగ హరిహర స్వామి మహా క్షేత్రాన్ని మెయింటైనెన్స్ పేరుతో తాళ్ళాయిపాలెం శివకు స్వామి వారి పీఠానికి ప్రభుత్వం పూర్తిగా అప్పగించాలనే యోచన చేస్తుందని జిల్లా దేవాదాయ శాఖ అధికారి పి.సీతారామయ్య తెలిపారు. శుక్రవారం కోటిలింగాల క్షేత్రానికి వచ్చిన ఆయన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సుమారు 40 ఎకరాల్లో 10 ఎకరాల విస్తీర్ణంలో ఈ నిర్మాణాలున్నాయన్నారు. ఈ క్షేత్రాన్ని నిర్మించిన శాశ్వత ధర్మకర్త గద్దె ప్రసాద్ 2009 సంవత్సరంలో ప్రభుత్వ ఎండోమెంట్ వారికి అప్పగించారని చెప్పారు. అప్పటి నుండి ప్రభుత్వ ఎండోమెంట్ వారు స్వామి, అమ్మవార్లకు ధూపదీప నైవేద్యాలు, పూజారులు, సిబ్బంది జీతభత్యాలను అందిస్తున్నారని వివరించారు. ఈ క్షేత్రానికి ఆనుకొని అలకనంద వెంచర్ భూములున్నాయి. దీనితో పాటు గత ప్రభుత్వ హయాంలో కృష్ణానదిలో కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవే రోడ్డుతో పాటు బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని పరిశీలించినట్లు చెప్పారు. ఎండోమెంట్ యాక్ట్ 145 ప్రకారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ హరి, కోటిలింగ మహా క్షేత్రం సిబ్బంది పాల్గొన్నారు.



దుప్పట్లు, చీరలు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం, రంగాపురం గ్రామ శివారు బూరుగగూడెం గ్రామానికి చెందిన రామినేని వెంకటేశ్వరరావు తండ్రి దివంగత రామినేని నారాయణస్వామి 8వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పేదలైన 50 మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. శుక్రవారం బూరుగగూడెంలో రామినేని వెంకటేశ్వరరావు గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామినేని వెంకటేశ్వరరావు, రామినేని చక్రధర్‌రావు, రామినేని రామకృష్ణ, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు చాట్ల విజయకుమార్, కోశాధికారి సునీల్, సెక్రటరీ హన్సు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి - మైలవరం : మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్, మోస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ పొందిన మహిళలకు ఆశాజ్యోతి ఫౌండేషన్ పాలడుగు వంశీకృష్ణ సహకారంతో శుక్రవారం విజయవాడ రోడ్డులోని భావన ఋషి కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కుట్టు మిషన్లు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చనుమోలు వరప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఉచితంగా నిర్వహించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యా, ఉపాధి, ఆరోగ్యం వంటి సేవా కార్యక్రమాలు ముందు ముందు చేపడతామన్నారు. మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయసుధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షురాలు శ్రీ పద్మ, పాలడుగు నాగేంద్రబాబు, ఉషారాణి, కాటమనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

3 నుంచి సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - తిరువూరు : సిపిఎం జిల్లా 25వ మహాసభలకు తిరువూరు సిద్ధమవుతోంది. జనవరి 3,4,5 తేదీల్లో జరగనున్న ఈ మహాసభల ఏర్పాట్లకు జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ పర్యవేక్షణలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా మహా సభల ప్రచార ఏర్పాట్లలో మునిగిపోయారు. తిరువూరు పట్టణం అంతటా ఎర్ర తోరణాలు, బ్యానర్లు కడుతున్నారు. మహా సభలు జయప్రదం చేసేందుకు, జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రతినిధులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లకు పార్టీ యంత్రాంగం కృషి చేస్తుంది.



అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన వెల్లువ



కంకిపాడులో...



బంటుమిల్లిలో...

ప్రజాశక్తి-బంటుమిల్లి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో మంత్రి పదవి నుంచి తొలగాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తుందని, దానిలో భాగంగానే రాజ్యాంగ నిర్మాతల్లో ఒకరైన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తుందని విమర్శించారు. ప్రపంచ దేశాలకే తలమానికంగా ఉన్న భారత రాజ్యాంగాన్ని అవమానించే పద్ధతుల్లో అమిత్ షా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు లంకదాసుల అజయ్‌ఘోష్, బొడ్డు నాగరాజు, పొదిలి వెంకన్న, సీనియర్ నాయకులు వంగల రాజా, కెవిపిఎస్ నాయకులు దేవదాసు తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీపురం సెంటర్లో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పాలుడుగు వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు బాబురావు ,బంటుమిల్లి వైస్ ఎంపిపి వాడిని చిన్నారి బాబు, కమ్మగంటి సాగర్ తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు:** మండలంలోని కోమటిగుంట గ్రామంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు తాడంకి నరేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వి.జాన్‌మోజేష్, నాగేశ్వరరావు, చింతలు తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం రూరల్:** కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయటం చాలా బాధాకరమని మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ అన్నారు. అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుండి తప్పించి పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేసారు. దళిత జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని అంబేద్కర్ సర్కిల్ నందు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత జాయింట్ యాక్షన్ కమిటీ కృష్ణాజిల్లా అధ్యక్షులు జక్కుల ఆనంద్ బాబు(జానీ), గంటా వెంకటేశ్వరరావు, ఎంఢ్రపాటి నాగేశ్వరరావు, వంపుగడవల చౌదరి, ఉచ్చుల గణేష్ తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం:** గన్నవరం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు, దళిత సంఘం నేతలు ఏంజెల్ విజయ్ కుమార్, బాబూరావు పాల్గొన్నారు.



బందరులో...



విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-ఉంగుటూరు : రాష్ట్రస్థాయి సూపర్ క్విజ్-బి పోటీలలో ద్వితీయ స్థానం సాధించడం గర్వంగా ఉందని పెద్ద ఆవుటపల్లి సాయి శ్రీనివాస హై స్కూల్ ప్రిన్సిపాల్ కెజెఎస్ సాయిబాబా అన్నారు. శుక్రవారం గుంటూరులోని డాక్టర్ కెఎల్ పి పబ్లిక్ స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి సూపర్ క్విజ్ -బి పోటీలకు 30 పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాల నుంచి షేక్ రోషన్ అన్సర్, ఎన్.రవిచంద్ పాల్గొని ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లపై సమీక్షించాలి

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-ఘంటసాల: కేంద్ర ప్రభుత్వం అగ్రకుల పేదలకు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల పేరిట పది శాతం రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంటులో 103వ రాజ్యాంగ సవరణ చేసి మరీ చట్టం చేయడం రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధమని, దీనిపై సుప్రీంకోర్టు విచారించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. శుక్రవారం ఘంటసాలలో బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు అందే జగదీష్ స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్లకు ప్రాతిపదికలుగా విద్యాపరంగా, సాంఘికంగా వెనుకబడిన సామాజిక సమూహాలే అర్హులని చెప్పినప్పటికీ, రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా ఆర్థికంగా వెనుకబడిన ఆధిపత్య కుల పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఎలా సాధ్యపడుతుందన్నారు. రిజర్వేషన్లు మొత్తం 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు పరిమితిని పది శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లతో మించి పోతున్నప్పుడు, సుప్రీం తానిచ్చిన తీర్పును తానే అతిక్రమించినట్లు కాదా అని వారు ప్రశ్నించారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల చట్టబద్ధతను, పునఃసమీక్షించి అణగారిన రిజర్వేషన్ వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు అందే జగదీష్, ప్రముఖ బీసీ నాయకులు కేశన కోటేశ్వరరావు, రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, నియోజకవర్గ కార్యదర్శి ఆత్కూరి సీతారామరాజు, ఉడతా చిత్తరంజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌సి, ఎస్‌టి ఉపకులాలకు న్యాయం చేయాలి'

ప్రజాశక్తి-చల్లపల్లి: సుప్రీం కోర్టు తీర్పు వల్ల నష్టపోయిన ఉపకులాలకు ఎక్కువ రిజర్వేషన్ కోటా ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లింగాల రవీంద్రరావు, దేవరపల్లి సురేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషనర్ రాజీవ్ రంజాన్ మిశ్రాను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని అందించినట్లు తెలిపారు. గతంలో వర్గీకరణ చట్టం రద్దుతో జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా ఎస్సీ వర్గీకరణ ఉండాలని కోరినట్లు చెప్పారు. 2004-24 మధ్యకాలంలో రిజర్వేషన్ ఫలాల లెక్కలు తీయాలని కోరామన్నారు. ఈ మేరకు కమిషనర్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. 2004లో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సుప్రీంకోర్టు రద్దు వేయడం వల్ల 20 ఏళ్లుగా ఎస్సీల్లోని అత్యంత వెనుకబడిన ఉపకులాలు రిజర్వేషన్ ఫలాలకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్లలో జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా నష్టపోయిన ఉపకులాలకు ఎక్కువ కోటాను కేటాయించాలని కోరామన్నారు. ఉద్యోగుల పదోన్నతులలో, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల భర్తీతో పాటు ప్రభుత్వం ఎస్సీలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల అమలులో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కమిషన్‌కు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.



రూ.56 లక్షలతో వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాల ప్రజలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరు గ్రామంలో రూ.56 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న 60 వేల లీటర్ల సామర్థ్యం గల హెడ్ వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్యాంక్ నిర్మాణానికి స్థల దానం చేసిన గ్రామస్తుడు త్రినాధరావును అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రజలకిచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించడంతోపాటుగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. బొమ్ములూరు గ్రామంలో వీధి వీధికి పైప్ లైన్, ఇంటింటికీ కుళాయి పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులు అతి త్వరలో పూర్తికానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, ఎంపీడీవో విష్ణు ప్రసాద్, తాసిల్దార్ రామకోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఈఓపిఆర్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.రామ్మోహనరావు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ సాల్మన్ రాజ్, టిడిపి నాయకులు లింగం బాబ్జీ, కొత్త సుబ్రహ్మణ్యేశ్వర, బుర్ర సుబ్బారావు, బోయిన సుబ్బయ్య, గుత్తా చంటి, ముత్యాల విజయ్ కుమార్, సొంటి నాగేశ్వరరావు, గుత్తా ఆజాద్, పూసల నాంచారయ్య, నవీన్, గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుర్వేద ఉత్పత్తులు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలోని సచివాలయం గదులలో మద్యం సేవించి ఖాళీ సీసాలు గదులలో పడవేసి ఉండటంతో దీనిని పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పంచాయతీ అధికారులను తీవ్రంగా హెచ్చరించడంతో వారు యుద్ధ ప్రాతిపదికన శుక్రవారం పంచాయతీ గదులను పరిశుభ్రం చేసే చర్యలు చేపట్టారు. కార్యాలయం ఇన్చార్జి ఈవో అనిత ఆధ్వర్యంలో సిబ్బంది గదులను పరిశుభ్రం చేయడంతో పాటు కార్యాలయం భవనం చుట్టూ ఎవరు బయట వారు కార్యాలయంలోకి ప్రవేశించకుండా పగడబందీగా ఏర్పాట్లు చేశారు. వెనకవైపు గేటు మూసివేయడంతో పాటు సరిహద్దు గోడ విరిగి ఉన్న ప్రాంతంలో పరదాలను అడ్డంగా కట్టించారు. ఎట్టకేలకు అధికారులు తీసుకున్న చర్యల పట్ల సిబ్బంది, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్శిల్ డోర్ డెలివరీని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాజిస్టిక్స్ ద్వారా ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు ఇంటివద్దకే పార్శిల్ డెలివరీ సౌకర్యాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు డిపో మేనేజర్ కెఎస్ఆర్ కె ప్రసాద్ అన్నారు. డోర్ డెలివరీ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బస్టేషన్ వద్ద ప్రదర్శన చేసి ఆర్టీసీ ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ పార్శిల్ విధానాన్ని తెలియచేశారు. రాష్ట్రంలో అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలలో 50 కిలోల బరువున్న పార్శిళ్లను పది కిలో మీటర్ల పరిధిలో ఇంటివద్దకే తీసుకువచ్చి అప్పగిస్తారని, వినియోగదారులు, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యతో పాటు నైతిక విలువలు బోధించాలి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం

విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు బోధించాలని, ధనార్జనే ధ్యేయంగా కాకుండా ఉన్నత విలువలతో కూడిన విద్యావ్యాప్తికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. శుక్రవారం రాత్రి గన్నవరం సెయింట్ జాన్స్ హైస్కూల్లో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. పిల్లల తల్లిదండ్రులు ఆనందం అదరహో అనిపించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యార్లగడ్డ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా అధునాతన పద్ధతులను అవలంభించి విద్యాబుద్ధులు నేర్పాలని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఇతర రంగాల్లో కూడా ప్రావీణ్యం కల్పించి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు యాజమాన్యాలు పాటుపడాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గన్నవరం సెయింట్ జాన్స్ అంటే ఒక బ్రాండ్ అయ్యిందని కితాబిచ్చారు. పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలతో ప్రభుత్వ విద్యాసంస్థలను పోటీపడేలా చేయాలని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అమ్మకు వందనం ఇవ్వడం ద్వారా మరింత చేయూత అందిస్తుందని తెలిపారు. సెయింట్ జాన్స్ పాఠశాల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి, డీఈవో రామారావు, ఎం ఈ ఓ రవి కుమార్, సెయింట్ జాన్స్ ప్రిన్సిపాల్ బ్రదర్ రెవ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అదరగొట్టారు. తొలుత స్వాగత నృత్యాలు ఆహుతులను అలరించాయి. ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ పాఠశాల విశిష్టతను వివరించారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం, మల్లెలలోని నన్నక నరేంద్ర, ధనలక్ష్మి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని వేము శ్రీలత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్ నాయక్ తెలిపారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఈ నెల 17న పమిడి ముక్కల మండలం, తాడంకి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో శ్రీలత పాల్గొని ఈనెల 22 నుంచి 25 వరకు రావుల పాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శుక్ర వారం పాఠశాలలో శ్రీలతను ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం

ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో 45 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 9 మంది విద్యార్థులు ఎల్లో, ఆరంజ్, బ్లూ బెల్టులను కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇటీవల జగ్గయ్యాపేట రాంకో శ్రీ సీత రామమ్మాల్ మందిర్ స్కూల్లో కరాటే చీఫ్ ఎగ్జామినర్ మిస్టర్ బెన్నీకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం పట్టణంలో లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో నిర్వహించిన బెల్ట్ అవార్డింగ్ ఫంక్షన్‌కు ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వివిధ రకాల క్రీడల్లో ప్రతిభ చూపాలని అన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి కలిగిన క్రీడల్లో పాల్గొంటూ, మంచి ప్రావీణ్యత సంపాదించాలని అన్నారు. క్రీడలు మానసిక ఉత్సాహానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ ఎస్.వి.వి.ప్రసాద్, కరాటే చీఫ్ ఎగ్జామినర్ మిస్టర్ బెన్నీ కుమార్, కరాటే కోచ్ ఎం.ఎం.నాయక్, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ఆచార్యులు, పీడీ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

1న మణి గీత మాలిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శ్రీ దాశరథి కృష్ణమాచారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా జనవరి 1వ తేదీ సాయంత్రం పిబి సిద్ధార్థ ఆడిటోరియంలో దాశరథి మణిగీత మాలిక కార్యక్రమం జరుగుతుందని జిఆర్‌కె పోలవరపు కోటేశ్వరరావు సాంస్కతిక సమితి అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు తెలిపారు. శుక్రవారం ఉదయం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాద వినోద(యుఎస్ఎ)సమర్పణలో గంగాధర్ ఫైన్ ఆర్ట్స్ సౌజన్యంతో జిఆర్‌కె పోలవరపు సాంస్కృతిక సమితి, సుమధుర కళానికేతన్ నిర్వహణ సారధ్యంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గాయనీ గాయకులు కార్యక్రమ నిర్వాహకులు పాల్గొని సంబంధిత గోడపత్రాన్ని విడుదల చేశారు.



అన్ని సౌకర్యాలతో ప్రభుత్వాస్పత్రి : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - తిరువూరు : ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించబడుతున్నాయని, ఇదొక బెస్ట్ ఆసుపత్రని, ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. తిరువూరు ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. రోగుల వార్డులోకి వెళ్లి ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది వైద్యం సరిగా చేస్తున్నారా, సౌకర్యాలు కల్పిస్తున్నారా, ఏమైనా సమస్యలున్నాయా అని కలెక్టర్ బాలింతలను అడిగి తెలుసుకున్నారు. మంచిగానే చూసుకుంటున్నారని, ఏలోటు లేదని, రోగులు చెప్పడంతో సూపరిండెండెంట్ గార్గేయను, డాక్టర్లను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి అధికంగా ఉంటుందని, మందులు కొరత కూడా లేదని అన్నారు. సరిహద్దు తెలంగాణ గ్రామాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రికి వచ్చి వైద్యం పొందుతున్నారంటే ప్రభుత్వ ఆసుపత్రి పనితనం ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. కుక్క కరిస్తే ప్రైవేటు ఆసుపత్రిలో దొరకని రేబిస్ వ్యాక్సిన్ ఇక్కడ కొరత లేకుండా అందు బాటులో ఉందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలు కింద కాన్పులు కూడా ఎక్కువగానే ఈ ఆసుపత్రిలో చేయటం అభినందనీయమన్నారు. సిబ్బంది కొరత కొద్దిగా ఉన్నప్పటికీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగానే భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని డంపింగ్ యార్డ్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో కమిటీ హెల్త్ సెంటర్ జిల్లా అధికారి బాలకోట నాయక్, ఆర్‌డిఒ కె.మాధవి, నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు సిబ్బంది పాల్గొన్నారు.


రోగుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఉత్సాహంగా పిబి సిద్ధార్థ విభావ - 24

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు విద్యతో పాటు సామాజిక, సాంస్కృతిక, సేవా, రంగాలపై కూడా ఆసక్తిపెంచుకుని ఆల్‌రౌండర్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆదిత్య యూనివర్శిటీ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ అన్నారు. పిబి.సిద్దార్థ కళాశాల పిజి కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులకు 'విభావ - 2024' సాంస్కృతిక కార్యక్రమాలను శుక్రవారం ఉదయం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్య ప్రణాళికను అధికమించి వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి అంశాన్ని పరిశీలించడంతో పాటు వాటిని ఆచరించే విధంగా చూడాలన్నారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ చైర్మన్ అనిల్ కుమార్ చింత మాట్లాడుతూ విద్యార్థులు చేసే చిన్న పని కూడా అద్భుతమైన విజయాలు సాధిస్తుందన్నారు. ఓటమికి నిరుత్సాహపడకుండా ప్రతి ఓటమి వెనుక విజయం ఉంటుందనే విషయాన్ని గ్రహించి విద్యార్థులు ముందుకు నడవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించి విజేతలైన వారికి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షత వహించగా కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ టి.ఎస్.రవి కిరణ్ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఎన్‌టిఆర్ పథకంలో రోగులకు టెలి ఐసియు వైద్యం

ఆస్టర్ రమేష్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమేష్ బాబు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చే నడపబడుతున్న ఇండో బ్రిటిష్ హాస్పిటల్స్‌లో రోగులకు సీనియర్ వైద్యనిపుణులచే అత్యాధునిక వైద్య సేవలందిస్తున్నామని ఆస్టర్ రమేష్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబు పోతినేని తెలిపారు. నగరంలోని రమేష్ హాస్పిటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి రోగిని 24 గంటలూ నిరంతరం వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించడానికి 'రమేష్ క్లౌడ్ డాక్స్' టెలి ఐ.సి.యూ వ్యవస్థ ద్వారా సెంట్రల్ కమాండ్ సెంటర్ నుంచి రోగిని ప్రతి క్షణం పర్యవేక్షించే వినూత్న వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. 2008 నుంచి 2020 మధ్య ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 20 వేల గుండె చికిత్సలు నిర్వహించామని తెలిపారు. గత 2 సంవత్సరాల కాలంలో ఇండో బ్రిటిష్ బ్రాంచ్‌లో వెయ్యి గుండె చికిత్సలు 99 శాతం సక్సెస్ రేట్‌తో రాయలసీమ, కోస్తా జిల్లాలు, ఉత్తరాంధ్ర, సరిహద్దు తెలంగాణ జిల్లాల రోగులకు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇటీవలే మినిమల్ ఇన్వేజివ్ కార్డియాక్ సర్జరీ(మిక్స్) పద్ధతి ద్వారా బైపాస్ సర్జరీలను నిర్వహించామని డాక్టర్.రమేష్ బాబు చెప్పారు. ఒడిషా రాష్ట్ర ఆరోగ్య పథకం అయిన 'బిజూ స్వాస్త్య కళ్యాణ యోజన' స్కీమ్ ద్వారా 40 మందికి చిన్నపిల్లలకు కూడా విజయవంతంగా వైద్య సేవలందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్.రాజా రమేష్, డాక్టర్ అనూప్, డాక్టర్ షహనాజ్, చిన్న పిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్. జ్యోతి ప్రకాష్, డాక్టర్.వాసుదేవ్, డాక్టర్.కత్తుల అనూష, కార్డియాక్ సర్జన్లు డాక్టర్.శివ ప్రసాద్, డాక్టర్.భరత్ సిద్దార్థ్, డాక్టర్.శ్రీకాంత్ మహాపాత్ర, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్. ఛాయ, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్.ధరణీంద్ర, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.మమత రాయపాటి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్.నాదెళ్ల గిరిబాబు, క్లస్టర్ బిజినెస్ హెడ్ డాక్టర్.కార్తీక్ చౌదరి, యూనిట్ హెడ్ డాక్టర్.సుమ, డాక్టర్.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి.రమేష్ బాబు

'బార్' హాలు ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో న్యాయవాదుల నూతన బార్ అసోసియేషన్ హాలును బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాబు విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోకార్యదర్శి అద్దంకి మణిబాబు, సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు, సీనియర్ న్యాయవాది తుర్లపాటి మార్కండేశ్వరరావు, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.





తపోవన్ విద్యార్థినికి రాష్టస్థాయి అవార్డు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ శక్తి సంరక్షణ మిషన్ వారిచే రాష్ట్రస్థాయిలో నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో తపోవన్ విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న చెరుకూరి సాహితి శక్తిని ఎలా సంరక్షించాలి అనే లఘు చిత్రంలో శక్తిని ఎలా సంరక్షించవచ్చనే అంశంపై నటించి సమర్పించిన లఘుచిత్రం రాష్ట్రస్థాయిలో ప్రోత్సాహక బహుమతి పొందింది. దీనిలో భాగంగా శుక్రవారం విజయవాడ వివంత హోటల్ వేదికగా కె.విజయానంద్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎనర్జీ కెవిఎన్ చక్రధర్ బాబు, ఎండి ఎపి జెన్కో వారి చేతుల మీదుగా రూ.2వేల నగదు బహుమతి, మెమొంటో, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థి సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ ఎం సుధీర్, విద్యార్థినిని గైడ్ టీచర్ ఎన్.బాబు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులును అభినందించారు.


అశోక్ గజపతి రాజుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు శుక్రవారం ఆలయానికి విచ్చేయగా ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ ఇఒ వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

భీమ బ్రిలియన్స్ డైమండ్ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జనవరి 5వ తేదీ వరకు భీమ జ్యూవెలర్స్ నిర్వహిస్తున్న బ్రిలియన్స్ డైమండ్ జ్యూవెలరీ ఫెస్టివల్లో ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని సంస్థ నిర్వాహకులు రాజేష్ తెలిపారు. నగరంలోని భీమా డైమండ్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ప్రతి క్యారెట్ డైమండ్ ఆభరణాలపై రూ.7వేలు తగ్గింపు లభిస్తుందన్నారు. దీంతో పాటు ప్రతి క్యారెట్ పై ఒక గ్రాము బంగారు నాణెం ఉచితంగా అందజేస్తారన్నారు. పాత వజ్రాలు, బంగారు ఆభరణాలతో చేసే కొనుగోళ్లపై ఛార్జీల్లో 10 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. భీమ బ్రిలియన్స్ డైమండ్ జ్యూవెలరీ ఫెస్టివల్ అనేక అద్భుతమైన ఆభరణాలను అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.